ధాన్యం కొనుగోలు
## జాప్యంపై రాస్తారోకో
■ నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్న బీఆర్ఎస్ నేత విజిత్..
■ ఆంక్షలు లేకుండా పంటను సేకరించాలి



8

# ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ మంగళవారం | 5 మే 2026 | ■ 13 పేజీలు

11




# అన్నదాతపై 'అదనపు' భారం

## కొనుగోలు కేంద్రాల వద్ద ఇష్టారాజ్యం..

■ ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల చేతివాటం! ■ బస్తాకు 43 కిలోలు తూకం వేయాల్సిందేనని మిల్లర్ల పట్టు
■ రైతుల నెత్తిన రూ. వేలల్లో నష్టం ■ దించేందుకు బస్తాకు రూ.2 ఇస్తేనే లారీ కదిలేది
■ రవాణా యజమానుల సరికొత్త నిబంధన ■ గతంలో బస్తాకు 42 కిలోలతోనే తూకం..
■ పర్యవేక్షణ కరవైన పౌరసరఫరాల శాఖ ■ ఆరుగాలం శ్రమించిన రైతుకు మిగిలేది కన్నీళ్లేనా?

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' అన్న చందంగా తయారైంది అన్నదాతల పరిస్థితి. ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలుపై ఎన్ని హామీలు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో మాత్రం మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ యజమానులు ఏకమై రైతులను అడకత్తెరలో పోకచెక్కలా నలిపేస్తున్నారు. సాధారణంగా ఒక ధాన్యం బస్తాలో 40 కిలోల ధాన్యం ఉంటుంది. గతంలో మిల్లర్లు 42 కిలోలను తూకం వేసేవారు. కానీ ఈ ఏడాది జిల్లాలో మిల్లర్లు ఏకమై ఏకంగా బస్తాకు 43 కిలోలు తూకం వేయాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దోపిడీపై అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.



### నిర్ణీత గడువులోగా ధాన్యం
## కొనుగోళ్లు పూర్తి చేయాలి

■ రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి
■ సారంగాపూర్ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ధాన్యం సేకరణ తీరును, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

### ఆటలతోనే శారీరక
## మానసిక దృఢత్వం

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ సెల్ ఫోన్లకు దూరంగా.. క్రీడలే లక్ష్యంగా విద్యార్థులు ఎదగాలి
■ జిల్లాలో ఐదు కేంద్రాల్లో 'పోలీస్ సమ్మర్ క్యాంప్'లు
■ 550 మంది విద్యార్థులకు నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ



## ప్రజల ముంగిటకే 'ప్రజావాణి'



13

■ సమస్యల పరిష్కారమే లక్ష్యం!
■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
■ హీరాపూర్ రోడ్డు పనులకు రూ. 12 కోట్లు
■ పైలట్ ప్రాజెక్ట్ 'సోలార్ గ్రామం'గా మార్పు
■ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామంలో నిర్వహించిన 'ప్రజావాణి' గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మరియు ఐటీడీఏ పీఓ మంద మకరందులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.



## పశువుల అక్రమ రవాణాపై కఠిన నిఘా

■ అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 11 చెక్‌పోస్టుల ఏర్పాటు
■ సోషల్ మీడియా పుకార్లను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు..
■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్

## గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం

■ కల్వకుంట్ల కవిత పిలుపు ■ కవితను కలిసిన జిల్లా అధ్యక్షుడు వినోద్ చారి



## ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి
# మిల్లులకు తరలించాలి



**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట కొనుగోలు కేంద్రాల పరిశీలన
- తడిసిన ధాన్యానికి మద్దతు ధర దక్కేలా చర్యలు
- కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం
- నమోదైన వివరాల ఆధారంగా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



**సారంగాపూర్, మే 4 (ప్రభాత సమాచారం)**
వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రైతులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్ణీత తేమశాతానికి రాగానే ధాన్యం తూకం వేసి, వెంటనే వరి ధాన్యాన్ని తరలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రతి రైతు తమ ధాన్యాన్ని శుభ్రపరచి మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీ కాంతరావు, సర్పంచ్ చిన్నయ్య పాల్గొన్నారు.





## వరి ధాన్యం కొనుగోలు
# సాఫీగా నిర్వహించాలి
### నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):**
జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తూ ధాన్యం వర్షాల వల్ల దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యపు సంచుల నిల్వ కోసం తగిన స్థలాలను ముందుగానే గుర్తించాలని, తూకం పూర్తయిన ధాన్యపు సంచులను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్ ప్రొజెనీ మ్యాపింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. బీఎల్వోలు మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. సూపర్వైజర్లు, తహసీల్దార్లు మ్యాపింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, స్థానిక అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం జనగణన ప్రక్రియకు సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆటలతోనే శారీరక, మానసిక దృఢత్వం







**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):**
'పోలీసులు మీకోసం' అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను (సమ్మర్ క్యాంప్) జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నార్నూర్, బోథ్ మండల కేంద్రాల్లో ఏకకాలంలో ఈ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు బానిసలై శారీరక శ్రమకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆటవిడుపుతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్‌ను రూపొందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 550 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని, ఇందులో ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్ లోనే 270 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈ క్యాంప్‌లో కబడ్డీ, వాలీబాల్, కరాటే, టేబుల్ టెన్నిస్, ఆర్చరీ, యోగా, క్రికెట్ వంటి క్రీడల్లో నెల రోజుల పాటు నిపుణులైన శిక్షకులచే శిక్షణ ఇస్తామన్నారు. కేవలం క్రీడలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నిర్వహణ, జైలు సందర్శన, డాగ్ స్క్వాడ్ పనితీరుపై ప్రత్యేక అవగాహన కల్పిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎస్పీ స్వయంగా విద్యార్థులతో కలిసి ఆర్చరీ, వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు, డీఎస్పీలు జీవన్ రెడ్డి, ఇంద్రవర్ధన్, మావల ఎస్హెచ్ఓ రాహుల్ కాంత్ ఐపీఎస్, వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మరియు క్రీడా శిక్షకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇంద్రవెల్లిలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక సాయి, ఇచ్చోడ, బోథ్, నార్నూర్ కేంద్రాల్లో స్థానిక సీఐలు ఈ శిబిరాలను ప్రారంభించారు.

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- సెల్ ఫోన్లకు దూరంగా.. క్రీడలే లక్ష్యంగా విద్యార్థులు ఎదగాలి..
- జిల్లాలో ఐదు కేంద్రాల్లో 'పోలీస్ సమ్మర్ క్యాంప్'
- 550 మంది విద్యార్థులకు నెల రోజుల పాటు వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ



## యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ
# సమర్థవంతంగా నిర్వహించాలి



**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం):** 2025-26 యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడా యువజన సేవల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రదేశాలలో ఉండేలా చూడడంతో పాటు గాలి తీవ్రతకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తేమ, ప్యాడి క్లీనర్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాతావరణ శాఖ అధికారులు వర్ష సూచనలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేసి అప్రమత్తమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియలలో జాప్యం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ధాన్యం తరలింపులో హమాలీలు, వాహనాల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, గ్రామ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తను పరిధిలోని ప్రతి కొనుగోలు కేంద్రాన్ని పర్యవేక్షించాలని, మే మాసాంతానికి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిర్ణీత మద్దతు ధరతో నిబంధనల ప్రకారం దాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, తేమ, ప్యాడి క్లీనర్ యంత్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి అవసరం మేరకు టార్పాలిన్ కవర్లు, గోనె సంచులు అందించడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ మర్రి ప్రవీణా రెడ్డి జయంతి వేడుకలు



**రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త శిబిరం**

**దండేపల్లి, మే 4 (ప్రభాత సమాచారం):** దండేపల్లి మండలంలోని మేద రిపేట మల్లికా నర్సింగ్ హోమ్‌లో కీర్తి శేషులు డాక్టర్ మర్రి ప్రవీణరెడ్డి71వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త శిబిరం నిర్వహించారు, అనంతరం రోగులకు పండ్లు బ్రెడ్ పాలు పంపిణీ చేసి, అన్న దానం చేశారు, ఈ సందర్భంగా డాక్టర్ మర్రి ప్రవీణా రెడ్డి, పేద ప్రజలకు. స్థానిక, ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు, నిరంతరం వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ రాత్రి పగలు అందుబాటులో ఉండి దండేపల్లి, జన్నారం, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలకు ఎనలేని సేవచేసి వైద్య వృత్తికి పరిమితం కాకుండా, పేద ప్రజలు గుండెల్లో గూడు కట్టుకుని, చెరగని ముద్ర వేసిన ఘనత ఆమెకే స్వంతం అయిందని పలువురు, ఆమె సేవలు గుర్తు చేసి అమ్మలకు అమ్మగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, మర్రి చంద్ర శేఖర్ రెడ్డి, మర్రి శ్రీ చరణ్, డాక్టర్ అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.





# దళారులకు పంట విక్రయించొద్దు

**ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దళారుల వద్ద పంట అమ్మకుండా మద్దతు ధరకు అమ్మాలని సూచించారు. సోమవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి రైతును సన్మానించి తూకం యంత్రాలకు పూజలు నిర్వహించారు. క్వింటాలుకు రూ.3699 మద్దతు ధరతో జొన్నలను కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోళ్లపై అనవసర రాజకీయాలు మానాలని, రైతులకు మేలు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. శనగ పంట కొనుగోళ్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం కొను గోళ్లు కొనసాగుతాయని, సమస్యలుంటే పరిష్కరిస్తామని తెలిపారు.

## కేయూ మొదటి, మూడవ
# సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**ఆసిఫాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో మే నెల 7 నుంచి నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను వాయిదా పడినట్టు సమాచారం. ఆర్టీసీ సమ్మె కారణంగా వాయిదా పడ్డ పరీక్షలు మే 19, 20 తేదీల్లో నిర్వహించనున్నారు. 07 నుంచి జరగాల్సిన పరీక్షలు మాత్రం 22 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్ కట్ల, పరీక్షల అదనపు నియంత్రణ అధికారి తిరుమల దేవి ఒక ప్రకటనలో తెలిపినట్టు అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి తెలిపారు.

# ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన జగ్గయ్యపేట మహిళలు

- ఎర్రని ఎండలో ఖాళీ బిందెలతో భీమిని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా...
- మిషన్ భగీరథ నీళ్లు రావు.. చెలిమెల నీరే దిక్కు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..
- కలెక్టరేట్ ముట్టడికి హెచ్చరిక.
- రూ. 1.25 లక్షలతో త్వరలోనే పైప్‌లైన్ పనులు ఎంపీడీవో వివరణ



**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం):** ప్రతి రోజు వాగు చేమల నీళ్లే దిక్కని.. మహిళలు ఆందోళనకు దిగారు. మమ్మల్ని పట్టించుకునే అధికారే లేరని మహిళలు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. మంచిర్యాల జిల్లా భీమిని మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ మహిళలు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మధ్యాహ్నం సమయంలో ఎర్రని ఎండను సైతం లెక్క చేయకుండా టాటా ఏసీ వాహనంలో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తమ గోడును వెల్లబోసుకున్నారు.కొన్ని నెలలుగా తమ గ్రామానికి త్రాగునీరు రావడంలేదని అన్నారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఈజీఎస్ కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం గ్రామ సమీపంలోని వాగు నీటి చెలిమెలు ద్వారా వంట చేసుకునేందుకు త్రాగునీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సర్పంచ్, కార్యదర్శికి త్రాగు నీటి సమస్య ఉందని చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామానికి ఇప్పటివరకు ఒక్క ఇంటికి కూడా భగీరథ నల్లా నీటి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. కాలనీలో 20 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎర్రని ఎండలో వాగు నీటిని తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు అంత ఇండ్ల ముందు పారుతుందన్నారు. తాగు నీటి సమస్య తీర్చకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. మహిళలు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి త్రాగు నీటి కోసం బైఠాయించిన విషయాన్ని ఫోన్లో ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇదివరకే కలెక్టర్ గ్రాంట్ నుంచి రూ.40 వేలు మంజూరయ్యాయని తెలిపారు. పైప్ లైన్ నిర్మాణం చేపట్టడానికి కాలనీకి లో పనులు చేపట్టేందుకు వెళ్లడంతో కాలనీ వాసులు పైప్ లైన్ నిర్మాణ పనులను వద్దన్నారని తెలిపారు. ఆ నిధులు ల్యాప్స్ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ద్వారా పైప్ లైన్ నిర్మాణానికి ఏఈ ద్వారా ఎస్టిమేంట్ వేసినట్లు రూ.1.25 లక్షలు మంజూరు అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మంజూరు కాగానే పైప్ లైన్ నిర్మాణం చేస్తామని అన్నారు.



## మీ-సేవా కేంద్రాలకు ఇంటర్వ్యూలు

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** మీ సేవా కేంద్రాల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ మీ సేవా కేంద్రాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2న నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాల ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ అసలు విద్యార్హత సర్టిఫికెట్లు, గుర్తింపు పత్రాలు, ఇతర అవసరమైన ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో రేపు (మంగళవారం) ఉదయం 11.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇంటర్వ్యూకు ఆలస్యంగా హాజరైన వారు లేదా అవసరమైన ఒరిజినల్ ధృవీకరణ పత్రాలు సమర్పించని వారికి అవకాశం ఇవ్వబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయపాలన పాటించి, ముందస్తుగా హాజరు కావాలని కోరారు.

## యోగ నిత్యజీవితంలో భాగం కావాలి

**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):** యోగ నిత్య జీవితంలో భాగం కావాలని బోథ్ సీఐ గురుస్వామి ఎస్సై పురుషోత్తంలో పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని క్రీడల వల్ల శారీంకంగా ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల మనిషిలో దురలవాట్లు దూరం అవుతాయని ధ్యానంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఆత్మ రక్షణ కోసం కరాటే అవసరం కాగా ఏకాగ్రత కోసం ధ్యానం అవసరమన్నారు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఈనెల 30 వరకు వేసవి శిబిరాలను కొనసాగిస్తామన్నారు, చిన్న పిల్లలు సెల్ఫోన్లకు దూరంగా ఉండడానికి శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు.



## వడదెబ్బతో యువకుడి మృతి

**మందమర్రి, మే 4 (ప్రభాత సమాచారం):** మందమర్రి పట్టణంలోని శాంతినగర్ గ్యారేజ్ ఏరియాకి చెందిన బండవరం ప్రశాంత్ (30) ఎండ దెబ్బ తగలడంతో ఇంట్లోనే మృతి చెందాడు. మృతుడు ప్రశాంత్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. పిల్లలు ఇద్దరు చిన్నారులు కావడంతో ఈ ఘటన చూసినవారందరూ కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడు మందమర్రి మండలం మామిడిగూడెం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారి గా ఉన్నాడు. మృతుని కుటుంబంలో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ప్రశాంత్ ఆకస్మిక మృతి బంధువులు, స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఘటన జరిగినట్లు భావిస్తున్నారు.

# రహదారి విస్తరణ బాధితులు ఆందోళన చెందవద్దు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి నిబంధనల ప్రకారం సహకారం
- కొత్తగా నిర్మించే మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో బాధితులకే మొదటి అవకాశం
- 55 అడుగుల విస్తరణతో సులభతరం కానున్న అత్యవసర సేవలు, రాకపోకలు
- ముందస్తు సమాచారం అందిస్తూ పనులు చేపట్టాలని, ప్రజలు సహకరించాలని అధికారులకు ఆదేశం..



**చెన్నూర్, మే 4 (ప్రభాత సమాచారం):** జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టిన రహదారి విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం 55 అడుగుల విస్తీర్ణంతో రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందని, నష్టపోయిన ఇండ్ల యజమానులు ఆందోళన చెందొద్దని తెలిపారు. నష్టపోయిన దుకాణ బాధితులకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మించే కమర్షియల్ కాంప్లెక్స్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇతర ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు మున్సిపల్ కార్యాలయం నుండి అందిన నోటీసులో పొందుపరచబడిన ధ్రువపత్రాలను సమర్పించినట్లయితే టి.డి.ఆర్. లో రాష్ట్రంలో ఎక్కడైనా వెసులుబాటు కల్పించడం జరుగుతుందని తెలిపారు. దశల వారీగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, రహదారి విస్తరణ ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని, అత్యవసర సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ పారదర్శకంగా పనులు చేపట్టాలని, రహదారి విస్తరణలో ప్రజలు, వ్యాపారస్తులు అధికారులకు సహకరించాలని తెలిపారు.

# ఇంధన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద మూడు బొలెరో వాహనాల సీజ్



- 10 ఎడ్ల స్వాధీనం
- క్రూరంగా పశువుల తరలింపు..
- జన్నారం పోలీసుల మెరుపు తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జంతు హింస చట్టం కింద కేసు నమోదు.
- అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు
- ఎస్సై ఉదయ్ కిరణ్ హెచ్చరిక

**జన్నారం, మే 4 (ప్రభాత సమాచారం):** మండలంలోని ఇంధన్‌పల్లి అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో మూడు బొలెరో వాహనాల్లో క్రూరంగా తరలిస్తున్న 10 ఎడ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జన్నారం నుండి నిర్మల్‌కు వెళ్తున్న ఒక బొలెరో వాహనం, జైనూర్ నుండి కరీంనగర్‌కు వెళ్తున్న మరో రెండు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా, అందులో పశువులను అత్యంత దారుణంగా, పరిమితికి మించి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో వాహనంలో మూడు నుండి నాలుగు ఎడ్లను కనీస వసతులు లేకుండా కట్టివేసి హింసిస్తూ తరలిస్తుండటంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై జంతు హింస నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులను అక్రమంగా తరలించినా, జంతువులను హింసించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఇలాంటి అక్రమ వ్యాపారాలు చేసే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరుగురు తల్లులు.. 139 మంది వారసులు



- కౌటా(బి)లో అపూర్వ కుటుంబ సమ్మేళనం
- నాలుగు దశాబ్దాల అనుబంధం
- ఒకే వేదికపై సింగారపు లక్ష్మన్న వంశీయుల సందడి.
- కన్నతల్లులకు పాదపూజ చేసిన సంతానం
- విడిపోయిన బంధాలను కలిపిన గెట్‌టుగెదర్..
- కమ్మని జ్ఞాపకాలను పంచుకున్న కుటుంబసభ్యులు

**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):** రక్తసంబంధం విలువను చాటుతూ, ఉరుకుల పరుగుల జీవితంలో మాయమవుతున్న బంధాలకు సరికొత్త అర్థాన్ని ఇచ్చింది ఆ కుటుంబం. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా ఒకే వంశానికి చెందిన 139 మంది సభ్యులు ఒకే చోట చేరి కౌటా(బి) గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కౌటా(బి) గ్రామంలో నివసించిన సింగారపు లక్ష్మన్న – ధర్మాబాయి దంపతులకు ఆరుగురు కుమార్తెలు. వారి పేర్లు లక్ష్మి, భూదేవి, ప్రేమల, నర్మద, కలమ్మ చిన్నబాయి. ఆ కాలంలోనే ఈ ఆరుగురు ఆడబిడ్డలకు సోనాల, చించోలి, కౌటా(బి), పొచ్చర, కనుగుట్ట మరియు దన్నూర్ గ్రామాలకు చెందిన వ్యక్తులతో వివాహాలు జరిగాయి. కాలక్రమేణా ఈ ఆరుగురు తల్లుల సంతానం, వారి పిల్లలు, మనుమలు, మనవరాలు, అల్లుళ్లు, కోడళ్లు కలిపి ప్రస్తుతం 139 మందికి చేరారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా తమ మూలాలను మరవకుండా, తమ పెద్దల జ్ఞాపకార్థం కౌటా(బి) గ్రామంలో గెట్–టు–గెదర్ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆరుగురు తల్లులను ఒకే చోట కూర్చోబెట్టి, వారసులు అందరూ కలిసి పాదపూజ చేయడం చూపరులను భావోద్వేగానికి గురిచేసింది. ఆధునిక కాలంలో తోబుట్టువుల మధ్యే సఖ్యత కరువవుతున్న తరుణంలో, ఇంత పెద్ద కుటుంబం ఏకతాటిపైకి రావడం విశేషం. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరినొకరు పలకరించుకుంటూ రోజంతా కోలాహలంగా గడిపారు. మారుతున్న కాలంలో ఇలాంటిసమ్మేళనాలు సమాజానికి ఎంతో అవసరమని, ఆరుగురు తల్లుల సంకల్పం గొప్పదని కొనియాడారు.




**డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం**

## పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, మే 4 (ప్రభాత సమాచారం):** డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని బెల్లంపల్లి డివిజన్ పరిధిలో బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం

- కల్వకుంట్ల కవిత పిలుపు
- కవితను కలిసిన జిల్లా అధ్యక్షుడు వినోద్ చారి
- పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను చేరవేస్తాం..
- సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం

**వాంకిడి, మే 4 (ప్రభాత సమాచారం):**
తెలంగాణ రక్షణ సేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్ చారి రాష్ట్ర అధ్యక్షురాలు కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ మరియు పార్టీ విస్తరణపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వినోద్ చారి మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం మరియు ప్రజల సంక్షేమమే తమ పార్టీ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. కవిత నాయకత్వంలో జిల్లాలోని ప్రతి మండలం మరియు గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేస్తామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ చేరవేసేలా కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కవిత సూచించినట్లు ఆయన వివరించారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజా ఉద్యమాలను చేపట్టడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో మహిళా విభాగం అధ్యక్షురాలు కావేటి సబిత మనోహర్, నాయకులు మొహమ్మద్ మౌసిన్, నర్సింగోజు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## నితికా పంత్‌ను కలిసిన నూతన డీఎస్పీ అశోక్

**మర్యాదపూర్వక భేటీ.. విధుల్లో నిబద్ధత చాటాలని ఎస్పీ ఆదేశం**
**ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచన.**
**విధుల బాధ్యతలపై దిశానిర్దేశం చేసిన ఎస్పీ**

**ఆసిఫాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సందడి నెలకొంది. ఆసిఫాబాద్ సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి. అశోక్, జిల్లా ఎస్పీ నితికా పంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, పోలీస్ యంత్రాంగం పనితీరుపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడకుండా, చట్టసభల పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా సామాన్య ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా సమర్థవంతంగా పనిచేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని నూతన డీఎస్పీకి ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఒకరికి 20 ఏండ్ల జైలు శిక్ష

**బెల్లంపల్లి, మే 4 (ప్రభాత సమాచారం):**
ఆరెండ్ల మైనర్ బాలికపై ఓ యువకుడు చేసిన నేరం రుజువై పోక్సో కేసులో 20 ఏండ్ల జైలు శిక్షకు గురయ్యాడు. రూ. 10 వేలు జరిమానా,బాధితురాలికి రూ.200000 లక్షల పరిహారం డీఎల్ఎస్ ద్వారా ఇవ్వాలని కోర్టు ఉత్తర్వు ఇచ్చింది. కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంపునకు చెందిన బండ సాయికృష్ణ 2020 తేదీ 21న మధ్యాహ్నం తన పిల్లలతో ఆడుకోవడానికి ఇంటికి వచ్చిన మైనర్ బాలికను ఇంట్లోకి తీసుకువెళ్ళి గదిలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. సదరు బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్ళి జరిగిన విషయం తల్లికి చెప్పింది. బాధితురాలి తల్లి బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్స్పెక్టర్ బి. రాజు కేసు నమోదు చేశారు. మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కోర్టు కేసు విచారణ చేసింది. లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్ ఇరువురి వాదనలు జడ్జి విన్నారు. ముద్దాయి ఫై నేరం రుజువు కావడశీతో జడ్జి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. 10,000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.2,00000 లక్షలు కాంపెన్సేషన్ ఇప్పించాలని ఆదేశించారని బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్సై శ్రీనివాస్ రావు తెలిపారు.



## అధునాతన సాగుతోనే అధిక దిగుబడులు



**వాంకిడి, మే 4 (ప్రభాత సమాచారం):**
రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం వాంకిడి మండలంలోని పలు రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురయ్యే సమస్యలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మాట్లాడుతూ.. రైతులు గుడ్డిగా రసాయన ఎరువులు వాడకుండా, ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి నేల స్వభావాన్ని బట్టి ఎరువులను వినియోగించాలని సూచించారు. దీనివల్ల అనవసర ఖర్చులు తగ్గడమే కాకుండా భూమి సారం దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. రానున్న వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, రశీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీలు, యంత్ర పరికరాలు మరియు ఇతర పథకాలు నేరుగా రైతులకు చేరాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 'ఫార్మర్ ఐడి' నమోదు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. అలాగే రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగు దిశగా అడుగులు వేయడం ద్వారా పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చని వివరించారు. ఈ సదస్సుల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




## సంతలో 'చల్లని' సేవ

**బాటసారుల దాహం తీరుస్తున్న అంబలి పంపిణీ**
**మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సౌజన్యంతో వేసవి ఉపశమనం**

**బెజ్జూర్, మే 4 (ప్రభాత సమాచారం):**
వేసవి భానుడి భగభగలకు విలవిల్లాడుతున్న సామాన్య ప్రజలకు, వ్యాపారులకు బెజ్జూర్ మండల కేంద్రంలో చల్లని ఊరట లభించింది. సోమవారం నిర్వహించిన వారసంతలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఆయన అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి భారీ ఎత్తున అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంతకు వచ్చిన వందలాది మందికి అంబలిని గ్లాసుల్లో పోసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో అంగడికి వచ్చే పేద ప్రజలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోనేరు కోనప్ప గత కొన్నేళ్లుగా వేసవి కాలంలో నిరంతరాయంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల ఆకలి, దాహార్తిని తీరుస్తున్నారని వారు పేర్కొన్నారు. వారసంతలో అంబలి తాగి దాహం తీర్చుకున్న కొనుగోలుదారులు, ప్రజలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో నాయకులు రమేష్, పుల్లూరి సతీష్, నరేందర్ గౌడ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, కోనప్ప అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**వాంకిడి, మే 4 (ప్రభాత సమాచారం):**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు త్వరితరగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని, బంబార సర్పంచ్ బెండరే కృష్ణాజి అన్నారు. సోమవారం గ్రామం పంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్యతో కలిసి బంబార గ్రామం తేలివాడలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు లతో మాట్లాడి ఇంటి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాడి సంతోష్, గ్రామ సెక్రటరీ దుర్గం ధర్మయ్య, వార్డు సభ్యులు లోహబడే ఉమేష్, డొకే బండు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా తన్నీరు రమేష్ బాధ్యతల స్వీకరణ

**తిరిగి విధుల్లో చేరిన రమేష్.. బదిలీపై వెళ్లిన సంపత్**
**ఎన్నికల అనంతరం పాత స్థానానికే కమిషనర్**
**పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వెల్లడి**

**బెల్లంపల్లి, మే 4 (ప్రభాత సమాచారం):**
బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా తన్నీరు రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ గతంలో కమిషనర్‌గా పనిచేసిన రమేష్, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా సంపత్ రెడ్డిని కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో, సంపత్ రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో తిరిగి తన్నీరు రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకార కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు



**బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ నాయకుల ఫైర్**
**చెన్నూరు ప్రగతిని చూసి ఓర్వలేకే**
**బాల్క సుమన్ అనుచరుల డ్రామాలు**
**నాడు నోటీసులు లేకుండా పేదల పొట్ట కొట్టిన వారు.. నేడు నీతులు చెబుతారా?**
**వ్యాపారస్తుల ఆమోదంతోనే రోడ్డు విస్తరణ..**
**స్వచ్ఛందంగా సహకరిస్తున్న పట్టణ ప్రజలు.**
**బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కాలం చెల్లింది**

**చెన్నూర్, మే 4 (ప్రభాత సమాచారం):**
చెన్నూరు పట్టణ ముఖచిత్రాన్ని మారుస్తూ శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూడటం బీఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పట్టణ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి వివేకానంద ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రతి గల్లీలో సీసీ రోడ్లు, సోలార్ హైమాస్ లైట్లు, 100 పడకల ఆసుపత్రి వంటి పనులతో చెన్నూరు ప్రగతి పథంలో దూసుకుపోతుంటే, ఓటమి భయంతో ఉన్న బీఆర్ఎస్ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తన నిద్రకు భంగం కలుగుతుందనే సాకుతో, క్యాంపు కార్యాలయం ముందున్న చిరువ్యాపారుల దుకాణాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించిన చరిత్రను మర్చిపోయారా? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో 'అంబేద్కర్ విగ్రహం నుంచి చెరువు కట్ట కనబడాలి' అని ప్రగల్భాలు పలికిన సుమన్, అప్పుడు రోడ్డు విస్తరణ ఎందుకు చేయలేదని నిలదీశారు. కేవలం అక్రమ వసూళ్లకు, ప్రలోభాలకు లొంగి నాడు అభివృద్ధిని అటకెక్కించారని విమర్శించారు. అంబేద్కర్ చౌక్ నుండి రావిచెట్టు వరకు చేపట్టిన 60 అడుగుల రోడ్డు విస్తరణకు వ్యాపారస్తులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని నేతలు తెలిపారు. మూడు దఫాలుగా చర్చలు జరిపి, ప్రతి ఒక్కరికీ అధికారికంగా నోటీసులు ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించామని స్పష్టం చేశారు. బాధితులను రెచ్చగొట్టేందుకు వెళ్లిన బీఆంఎస్ నాయకులకు, వ్యాపారస్తులే స్వచ్ఛందంగా తమ షాపులను తొలగించుకోవడం చూసి నోట మాట రాలేదని ఎద్దేవా చేశారు. మహంకాళివాడలో పేద రైతుల ఇళ్లను కూల్చిన వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని మాట్లాడుతున్నారని మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ తోల రాజిరెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయమని ప్రోత్సహించడమే కాకుండా, విద్యుత్ సిబ్బందిపై దాడులు చేయించడం బీఆర్ఎస్ రౌడీ రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఇలాంటి కుటిల ప్రయత్నాలను మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పటణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంచాలి

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):**
పేద ప్రజల విద్య అవసరాల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున విద్యా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని దీన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. ముఖ్యంగా ఇటీవల వెలువడిన ఎస్ఎస్‌సీ ఫలితాలలో నిర్మల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్‌ని అభినందిస్తూ, ఈ విజయానికి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో కలెక్టర్ దృష్టి సారించాలని ఎస్.టి.యు.టి.ఎస్. నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల నాణ్యమైన విద్య కోసం సహకరిస్తామని తెలిపారు.

## భైంసా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

**ముథోల్, మే 4 (ప్రభాత సమాచారం):**
పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏరియా హాస్పిటల్ రోగులకు అవసరమయ్యే సదుపా యాలు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందవలసిన అవసరం ఏర్పడుతుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోగుల పరీక్షల కోసం ఏర్పాటుచేసిన వివిధ మిషన్లు పనిచేయడం లేదని వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## సన్ డే.. ఎండా వేడితో ప్రజలు బెంబేలు



**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):**
నిర్మల్ జిల్లాలో ఆదివారం సూర్యుడు మండిపోయారు. రికార్డ్ స్థాయిలో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకోవడంతో ఎండకు తోడు వేడి గాలులు వీస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి ఎండలు పెరుగుతూ మధ్యాహ్నం నిప్పుల కొలిమిగా మండిపోతున్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు వేడి గాలులు వేయడంతో మధ్యాహ్నం పూట రోడ్లన్నీ జనం లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితులు బయటకు వస్తే జనాలు గొడుగులు, తలకు రుమాలు టోపీలు పెట్టుకుని బయటకు వస్తున్నారు. చల్లని పానీయాలను తాగుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసే రైతులు కూలి పనులు చేసే కార్మికులు ఎండా వేడిమి కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారు.

## అధికారులు అందుబాటులోఉండాలి



**బెల్లంపల్లి, మే 4 (ప్రభాత సమాచారం):**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి సబ్ కలెక్టర్ మనోజ్ హాజరై మాట్లాడారు. జీవోఎంఎస్ నంబర్ 3 ప్రభుత్వం జారీ జరిగిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ జీవో ను జారీ చేశారని తెలిపారు. ప్రజల కు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. 32 అర్జీలు వచ్చాయి. డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి కి 32 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ కుమార్ దీపక్ అంతకుముందు బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజావాణి కార్యక్రమాన్ని చిత్తశుద్దిగా నిర్వహించాలన్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు అందించాలన్నారు. పోర్టల్‌లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు.



## నిర్మల్‌లో జొన్న కొనుగోలు
# కేంద్రాల ప్రారంభం

**ప్రతి గింజనూ ప్రభుత్వం సేకరించాలి**
**ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**
**వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్లను ప్రారంభించిన బీజేఎల్పీ నేత**
**క్వింటాల్‌కు రూ. 3,180 మద్దతు ధర..**
**కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహం**
**అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం**

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):**
రైతులు పండించిన జొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రతి గింజనూ ప్రభుత్వం నిబంధనలతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌తో పాటు, సారంగాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 3,180 గా ఉందని, రైతులెవరూ దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. అయితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం చేసిన జాప్యం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఒకవైపు అకాల వర్షాలు, ఈదురు గాలులతో చేతికొచ్చిన పంట నేలపాలై రైతులు ఆవేదనలో ఉంటే, మరోవైపు ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను నెమ్మదిగా సాగించడం దారుణమన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని, నాణ్యత సాకులు చెప్పకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



**ఆసిఫాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):**
ప్రజావాణిలో వచ్చే ప్రతీ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కె హరిత అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, డేవిడ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అన్నారు. గత ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించా లన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఇళ్ల గణనలో భాగంగా స్వీయ గణన మే 10 లోగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, పొరుగు సేవల ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం దిందా గ్రామంలో రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు నారాయణ దరఖాస్తు అందజేశారు. చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన అమృత తమ పట్టా భూమిలో ఇతరులు బలవంతగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మారు తినగర్‌కు చెందిన స్వాతి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, బెజ్జూరు మండలం ఎల్కపల్లికి చెందిన రాజేశ్వరి తన పేరు ఇందిరమ్మ ఇల్లు మొదటి జాబితాలో ఉన్నా మంజూరు కాలేదని మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన పూజిత తన పేరున లిస్టు-3 నుంచి లిస్టు 1కి మార్చుట గురించి దరఖాస్తు చేసుకున్నారు.



### యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ

# సమర్ధవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రబాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు లతో కలిసి, అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో విడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్టంలో పలుచోట్ల అకాల వర్షాలు



కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పలిన్ కవర్లు, అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు, అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు తెలియ జేయలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నుంచి, ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నిర్ణీత సమయానికి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో రైతులకు తెలియజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి, మేనేజర్ లు సుధాకర్, రాజేందర్ లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్..
- ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు ఆదేశం
- డివిజన్ కేంద్రాల్లోనూ ప్రజావాణి.. మారుమూల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి...
- సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచన
- పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని స్పష్టీకరణ

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్



మాట్లాడుతూ, ఆర్డీఓ కార్యాలయం నిర్మల్, సబ్ కలెక్టర్ కార్యాలయం బైంసాలో డివిజన్ వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించండి

**ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** ప్రజా సమస్యలను త్వర గా పరిష్కరించాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల విభాగంలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యా దుదారుల సమస్యలు విని పరిష్కారానికి సంబంధిత అధికా రులకు సూచనలు ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల విభాగంలో 14 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవా లని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందన్నారు.

**మహిళలు, చిన్నారుల రక్షణే పోలీసుల ప్రాధాన్యం..**

మహిళలు, చిన్నారుల రక్షణే పోలీసుల తొలి ప్రాధాన్యం అని ఎస్పీ నితికా పంత్ అన్నారు. సోమవారం జిల్లా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడారు. గత ఏప్రిల్ నెలలో షీ టీం ద్వారా 35 అవగాహన కార్యక్రమాలు, 13 ఫిర్యాదు లు స్వీకరించినట్లు తెలిపారు. షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, భరోసా కేంద్రా ల ద్వారా మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వేధింపులకు గురైతే షీ టీంలను సంప్రదించాలని ఆసిఫాబాద్(87126705 64), కాగజ్‌నగర్ (8712670565) సంప్రదించాలన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన మైనారిటీ విద్యార్థులకు సన్మానం

**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం):** మంచిర్యాల జిల్లాలోని మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్స్‌లలో 10వ తరగతి, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంచిర్యాల కలెక్టరెట్‌లో మంచిర్యాల కలెక్టర్ పి. చెంద్రయ్య సన్మానం చేశారు, ఈ సందర్భంగా ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు కల్పించే ఈ అవకాశాలు వినియోగించు కుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి నీరటి రాజేశ్వరి (ఆసిఫాబాద్,మంచిర్యాల జిల్లాలు) షాగుఫ్త ఫిర్దోస్, అకాడమిక్ కోర్డినేటర్ వీణ. రిజ్వాన్, విజిలెన్స్ ఆఫీసర్ వీణ. తాహేరుద్దీన్, చెన్నూర్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ దీ. సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపాల్ వీణ. నీలు పాల్గొన్నారు.



# వైద్యం వికటించి బాలుడి కాళ్లకు ఇన్ఫెక్షన్

- ఆర్‌ఎంపీ డాక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష
- నిందితుడికి రూ.10 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు
- 2016లో బేలలో జరిగిన ఘటనపై విచారణ పూర్తి
- సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం శిక్ష ఖరారు చేసిన న్యాయమూర్తి చింతల దివ్యవాణి
- దర్యాప్తు అధికారి, సిబ్బందిని అభినందించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** చిన్నారి బాలుడికి వికటించిన వైద్యం చేసిన ఘటనలో ఆర్‌ఎంపీ డాక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చింతల దివ్యవాణి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలను జైనథ్ సీఐ జి. శ్రావణ్ వెల్లడించారు. బేల మండలం మనియార్‌పూర్ గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలుడికి, అదే మండలానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ తలపొక్కుల్వార్ లక్ష్మణ్ అలియాస్ లచ్చన్న (56) 2016లో చికిత్స చేశాడు. అయితే, నిందితుడు అందించిన వైద్యం వికటించడంతో ఆ బాలుడి రెండు కాళ్లకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు బేల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కె. నరేష్ కేసు నమోదు చేసి, లోతైన విచారణ జరిపి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి షహీన్ సుల్తానా ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. నిందితుడి నిర్లక్ష్యం వల్ల బాలుడు తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు సాక్ష్యాధారాలతో నిరూపితం కావడంతో, న్యాయమూర్తి నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష మరియు రూ. 10,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచి, నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారిని, కోర్టు కానిస్టేబుల్స్‌ను మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా లేదా నిర్లక్ష్యంగా వైద్యం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

## 6న మెగా జాబ్ మేళా

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఐటీ, హెల్త్ కేర్, ఇండస్ట్రియల్, ఫార్మా, రిటైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, సేవా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొననున్నాయి.



## స్పీడ్ పెంచేసిన ప్రభాస్

ప్రభాస్ ప్రస్తుతం చాలా సినిమాలతో బిజీగా ఉన్నారు. సమ్మర్ బ్రేక్ తర్వాత ఆయన రేపటి నుంచి హైదరాబాద్‌లో జరుగుతున్న "కల్కి 2898 AD" సీక్వెల్ షూటింగ్‌కి హాజరవుతున్నారని సమాచారం. హైదరాబాద్ బయట భారీ సెట్‌ను నిర్మించారు. ఈ కొత్త షెడ్యూల్‌లో కొన్ని ముఖ్యమైన సీన్స్ షూట్ చేయనున్నారు.ప్రభాస్ మొదటిసారి ఈ సీక్వెల్ సెట్స్‌లో పాల్గొనబోతున్నారు. మే నెలలో ఈ సినిమా కోసం ఆయన ఎక్కువ డేట్స్ కేటాయించినట్లు తెలుస్తోంది.గత ఫిబ్రవరిలోనే షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ఇతర కమిట్మెంట్స్, సమ్మర్ బ్రేక్ కారణంగా ప్రభాస్ ఇప్పటివరకు షూట్‌కి రాలేదు. ఇప్పటివరకు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్‌కు సంబంధించిన కొన్ని కీలక సీన్స్ పూర్తయ్యాయి.ముందు భాగంలో దీపికా పదుకోణ్ చేసిన "సుమతి" పాత్రకు ఇప్పుడు సాయి పల్లవి ఎంపికయ్యారని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.అలాగే కమల్ హాసన్, ఇతర ప్రధాన నటులు మొదటి భాగంలో ఉన్నవారు ఈ సీక్వెల్‌లో కూడా కొనసాగుతారని సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్ నిర్మిస్తోంది.ఇక ప్రభాస్ త్వరలోనే "ఫౌజీ" షూట్ కూడా పూర్తి చేయాల్సి ఉంది. తర్వాత "స్పిరిట్" సెట్స్‌లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. ఈ సినిమాల రిలీజ్ డేట్స్‌పై స్పష్టత త్వరలో రానుంది.ఇదిలా ఉంటే, ఫ్యాన్స్‌లో మరో బజ్ కూడా ఉంది. ప్రభాస్ ఇవాళ రాత్రి నుంచే షూట్‌కి హాజరవుతారని, కొన్ని రోజులు షూట్‌లో పాల్గొంటారని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది.



## మళ్లీ మళ్లీ ప్రేమలో పడొచ్చు

మిల్క్ బ్యూటీ తమన్నా తన పర్సనల్ లైఫ్, ప్రేమ వ్యవహారాలపై చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఒకసారి ప్రేమలో విఫలం అయినా అటు వైపుమళ్లీ వెళ్లాలి అనుకోవడం లేదు అని అంటుంటారు. కానీ తమన్నా ఆలోచనలు దానికి భిన్నంగా ఉన్నాయి. విజయ్ వర్మతో ప్రేమ, బ్రేకప్ అనంతరం మళ్లీ కెరీర్‌పై ఫోసక్ పెట్టి వరుస సినిమాలు చేస్తుంది. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. ప్రేమ ఒక్కరితోనే ఆగిపోవాల్సిన అవసరం లేదంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. 'జీవితంలో ఎన్నిసార్లు అయినా ప్రేమలో పడే అవకాశం ఉంటుంది. అది కేవలం ఒక్క వ్యక్తికే పరిమితం కావాల్సిన అవసరం లేదు. మనసుకు నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్ప లేదు. ఎందుకంటే బంధాలు అనేవి మనల్ని ఒకచోట కట్టిపడేసేవిగా లేదా మన స్వేచ్ఛను హరించేవిగా ఉండకూడదు. భాగస్వామితో ఉండే బంధం మన ఎదుగుదలకు తోడ్పడేలా, ఒకరినొకరు ప్రోత్సహించుకునేలా ఉండాలి. అలాంటి ఆరోగ్యకరమైన బంధం దొరికే అన్వేషణ కొనసాగిస్తూనే ఉంటా' అంటూ తమన్నా చెప్పడం విశేషం.



## వినోదం నిండిన ప్రేమకథ

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ జంటగా మధుదీప్ చెలికాని తెరకెక్కించిన చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. అరవింద్ మండ్యం నిర్మాత. అనీష్ కురువిల్లా, శివాజీ రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా శ్రీ వెంకట సాయి ఫిల్మ్స్, ముత్యాల రాందాస్ డిస్ట్రిబ్యూషన్‌లో ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. "నిజాయతీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందన్నదే ఈ చిత్ర కథాంశం" అన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం గంగారం గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి రాజ్ కుమార్ గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినియోగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన బల్మూరి పద్మ తనకు చెన్నూరు మున్సిపాలిటీలోని గేర్ర కాలనీలో ఇల్లు ఉందని, ఈ ఇంటిని ఇతరుల పేరిట నమోదు చేసి అక్రమానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్‌కు చెందిన అంజయ్య తన కుమారుడికి పుట్టుకతో మూగ, చెవుడు ఉన్నాయని, యు డి ఐ డి కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ తమ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని తెలుపుతూ సమస్యను



పరిష్కరించాలని దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన గడి కొప్పుల పద్మ తనకు గ్రామ శివారులో గల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.. చెన్నూరు పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన అఫ్రోజ్ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు బెల్లంపల్లి డివిజన్ పరిధిలో బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని మండల అధికారి కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ. 50 వేలివ్వాలి



- ■ తుల శ్రీనివాస్ ■ కనుగుట్టలో కాలిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎంపీపీ
- ■ విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం ■ తక్షణ సాయంగా రూ. 20 వేలు అందించాలని డిమాండ్
- ■ ప్రభుత్వం సకాలంలో కొనుగోళ్లు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు
- ■ బాధిత రైతులకు అండగా నిలవాలని అధికారులకు విన్నపం

**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో జాప్యం వెరసి అన్నదాతను నిట్టనిలువునా ముంచాయని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మండిపడ్డారు. మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన మొక్కజొన్న పంట పొలాలను సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కళ్లముందే కష్టమంతా బూడిదవ్వడంతో కన్నీరుమున్నీరవుతున్న రైతులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాద బాధితులకు ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణ ఉపశమనం కింద ప్రభుత్వం వెంటనే రూ. 20 వేలు ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు. వేలాడే విద్యుత్ తీగల విషయంలో విద్యుత్ శాఖ ఏఈ తీవ్ర నిర్లక్ష్యం వహించారని, ఆ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు పడటం వల్లే పంట కాలిపోయిందని ఆరోపించారు. అధికారుల తీరు మార్చుకోకపోతే రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించి ఉంటే, రైతులు తమ పంటను అమ్ముకునేవారని, ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షులు రవి, గంగమల్లు, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, మండల కార్యదర్శి ఎలుక రాజు, రమేష్, నవరాజు, పోతన్న, సురేందర్ యాదవ్, సర్పంచులు రవీందర్, బాబులాల్, ఉప సర్పంచ్ రమణ, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కనుగుట్ట అగ్నిప్రమాదంలో

# 47 ఎకరాల్లో పంట దగ్ధం

**రూ.44 లక్షల నష్టం : ఆర్డీఓ జగదీశ్వర్ రావు**

**క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించిన ఆర్డీఓ, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు**

**మొక్కజొన్నతో పాటు పూర్తిగా కాలిబూడిదైన సాగునీటి పైపులు, సామగ్రి**

**నష్ట పరిహారం కోసం జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేత.**

**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):**

మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఆదివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై రెవెన్యూ యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 47 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు, ప్రాథమిక అంచనా ప్రకారం రూ.44 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ఆదిలాబాద్ ఆర్డీఓ జగదీశ్వర్ రావు వెల్లడించారు. సోమవారం ఆయన తహసీల్దార్ సుభాష్ చంద్ర, వ్యవసాయ శాఖ ఏడీఏ, విద్యుత్ శాఖ ఏడీలతో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. కాలిబూడిదైన మొక్కజొన్న చేలను, కరిగిపోయిన సాగునీటి పైపులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. అగ్నిప్రమాదం కారణంగా రైతులు పండించిన పంటతో పాటు, పొలాల్లో అమర్చుకున్న ఖరీదైన పివిసి పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల వారీగా నష్టాన్ని లెక్కించడం జరిగిందని, ఈ నివేదికను వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలాంటి ప్రమాదం జరగడం రైతులకు తీరని లోటని, వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐఎన్టీయూసీ

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం):**

మంచిర్యాల పట్టణంలోనీ ఐఎన్‌టియుసి కార్యాలయంలో ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి, జెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్ మాట్లాడుతూ ఐఎన్టీయూసీ భారతదేశానికి స్వాతంత్రం రాకముందే 1947, మే 3న ఈ దే శంలో పురుడు పోసుకున్నదన్నారు. కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం పార్టీ, సంఘం పాటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు తిరుపతి, చంద్ర మౌళి, పాల్తపు శంకర్, వడ్లకొండ రంజిత్ గౌడ్, గుండొజు రమేష్, శ్రావణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## అమ్మా ఏడవకండి..

# మీ కష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

- కనుగుట్ట రైతులకు అన్వేష్ రెడ్డి భరోసా
- కాలిపోయిన పంటను చూసి కన్నీరుమున్నీరైన రైతులు
- అక్కున చేర్చుకున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):**

నేను కూడా ఒక రైతు బిడ్డనే.. మీ కష్టమేంటో నాకు తెలుసు. ధైర్యంగా ఉండండి, ప్రభుత్వం మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకుంటుంది. అంటూ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి కనుగుట్ట అగ్నిప్రమాద బాధితులకు భరోసానిచ్చారు. సోమవారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన మొక్కజొన్న చేలను ఆయన పర్యవేక్షించారు. చైర్మన్ పర్యటన సందర్భంగా తమ ఆశలన్నీ బూడిదయ్యాయని భావించిన రైతు కుటుంబాలు అన్వేష్ రెడ్డిని చూడగానే ఒక్కసారిగా బోరున విలపించాయి. బాధిత మహిళల ఆవేదనను చూసి చలించిపోయిన చైర్మన్, వారిని ఓదారుస్తూ.. "తల్లి ఏడవకండి, మీ కుటుంబాలకు బాసటగా ఉండేందుకే మేము వచ్చాం" అని ధైర్యం చెప్పారు. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని తాను స్వయంగా పరిశీలించానని, అధికారులు సిద్ధం చేసిన అంచనా నివేదిక అందగానే ముఖ్యమంత్రితో పాటు



సంబంధిత మంత్రులకు వివరిస్తానని ఆయన తెలిపారు. వాస్తవ పరిస్థితులను మంత్రులకు వివరించి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని మాటిస్తున్నాను" అని పేర్కొన్నారు. మంటలు చెలరేగిన సమయంలో ప్రాణాలకు తెగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన గ్రామ యువకుల సాహసాన్ని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని నిర్ధారణకు వచ్చామని, బాధ్యులైన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




# అన్నదాతపై 'అదనపు' భారం

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

## కొనుగోలు కేంద్రాల వద్ద ఇష్టారాజ్యం..

- ■ ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల చేతివాటం! ■ బస్తాకు 43 కిలోలు తూకం వేయాల్సిందేనని మిల్లర్ల పట్టు
- ■ రైతుల నెత్తిన రూ. వేలల్లో నష్టం ■ దించేందుకు బస్తాకు రూ.2 ఇస్తేనే లారీ కదిలేది
- ■ రవాణా యజమానుల సరికొత్త నిబంధన ■ గతంలో బస్తాకు 42 కిలోలతోనే తూకం..
- ■ పర్యవేక్షణ కరవైన పౌరసరఫరాల శాఖ ■ ఆరుగాలం శ్రమించిన రైతుకు మిగిలేది కన్నీళ్లేనా?

**జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' అన్న చందంగా తయారైంది అన్నదాతల పరిస్థితి. ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలుపై ఎన్ని హామీలు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో మాత్రం మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ యజమానులు ఏకమై రైతులను అడకత్తెరలో పోకచెక్కలా నలిపేస్తున్నారు. సాధారణంగా ఒక ధాన్యం బస్తాలో 40 కిలోల ధాన్యం ఉంటుంది. గతంలో మిల్లర్లు 42 కిలోలను తూకం వేసేవారు. కానీ ఈ ఏడాది జిల్లాలో మిల్లర్లు ఏకమై ఏకంగా బస్తాకు 43 కిలోలు తూకం వేయాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దోపిడీపై అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' అన్న చందంగా తయారైంది అన్నదాతల పరిస్థితి. ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలుపై ఎన్ని హామీలు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో మాత్రం మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ యజమానులు ఏకమై రైతులను అడకత్తెరలో పోకచెక్కలా నలిపేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దోపిడీపై అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**42 పోయి 43 కిలోలకు చేరిన తూకం...**

సాధారణంగా ఒక ధాన్యం బస్తాలో 40 కిలోల ధాన్యం ఉంటుంది. అయితే, తాలు, తప్ప, తేమ శాతం వంటి కారణాల రీత్యా గతంలో మిల్లర్లు 42 కిలోలను తూకం వేసేవారు. దీనికి రైతులు కూడా కొంతమేర అంగీకరించేవారు. కానీ, ఈ ఏడాది జిల్లాలో మిల్లర్లు ఏకమై ఏకంగా బస్తాకు 43 కిలోలు తూకం వేయాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో సుమారు 1.18 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో దొడ్డు రకం 1.16 లక్షల ఎకరాలు ఉండగా, సుమారు 2.95 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్‌పీ ప్రకారం కిలో ధాన్యం విలువ రూ. 23 పైచిలుకు ఉంది. అంటే, ఒక్కో రైతు వద్ద అదనంగా ఒక కిలో కోత విధిస్తే, వంద క్వింటాళ్లు విక్రయించే రైతుకు సుమారు రూ. 23 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. తాలు పేరుతో ఇప్పటికే తాము రెండు కిలోలు వదులుకుంటుంటే, ఇప్పుడు మరో కిలో అదనంగా అడగడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అదనపు వసూళ్లలో లారీ యజమానుల వాటా...**

రైతుల కష్టాన్ని మిల్లర్లు కిలోల రూపంలో దోచుకుంటుంటే, లారీ యజమానులు రూపాయల రూపంలో దండుకుంటున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకం వేసి, లారీల్లో లోడ్ చేసినందుకు క్వింటాలుకు రూ. 60 చెల్లించే పద్ధతి ఉంది. కానీ ఇప్పుడు లారీ యజమానులు కొత్త మెలిక పెట్టారు. కొనుగోలు కేంద్రాల వద్ద లోడ్ చేసిన ధాన్యాన్ని మిల్లుల వద్ద దించేందుకు (అన్‌లోడింగ్) బస్తాకు రూ. 2 చొప్పున అదనంగా చెల్లించాలని పట్టుబడుతున్నారు. అంటే ప్రతి క్వింటాలుకు మరో రూ. 5 అదనపు భారం రైతుపై పడుతోంది. పైసా పైసా కూడబెట్టుకునే పేద రైతు నుంచి ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.



**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

జిల్లాలో డీఆర్‌డీఏ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 319 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న పౌరసరఫరాల శాఖ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అక్రమాలను అరికట్టడంలో విఫలమవుతోందని విమర్శలు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత తమపై లేనట్లు అధికారులు వ్యవహరించడం మిల్లర్లకు వరంగా మారుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పాత పద్ధతి ప్రకారం 42 కిలోలతోనే తూకం వేయాలని, అదనపు వసూళ్లను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

---



# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ■ జిల్లా వ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్
- ■ ఒకే రోజు 1558 వాహనాల తనిఖీ..
- ■ ప్రజల భద్రత కోసమే తనిఖీలు : ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పోలీసులు విస్తృతస్థాయిలో 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించారు. జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్), నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 1558 వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 79 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని 61 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వీటితో పాటు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 9 మంది మైనర్లపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. రాత్రి వేళల్లో అనవసరంగా, అనుమానాస్పదంగా రోడ్లపై తిరుగుతున్న సుమారు 200 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వేలిముద్రలను (ఫీఱఅస్త్రవతీఱఅ్‌ం) సేకరించి నేరచరిత్రను తనిఖీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వాహనాలకు స్పష్టమైన నంబర్ ప్లేట్లు ఉండాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సివిల్ పోలీసులతో పాటు ట్రాఫిక్ మరియు రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## చనిపోయిన పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం

**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లాలోని బాసర పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వెంకట రమణ అనే హోం గార్డు కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా యాక్సిడెంటల్ బెనిఫిట్ స్కీమ్ కింద మృతుడి కుటుంబానికి రూ.30 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్, తన చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సంక్షేమం పట్ల ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేరకు ఆదరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పైపులో అస్థిపంజరం

### రాయాపూర్ కాండ్లి శివారులో కలకలం

**ముథోల్, మే 4 (ప్రభాత సమాచారం):** లోకేశ్వరం మండలంలోని రాయాపూర్ కాండ్లి శివారులో గుర్తు తెలియని మనిషి అస్తి పంజరం లభ్యమైన తో ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆ మనిషిని చంపారో, లేక ఇతర కారణాలవల్ల చనిపోయారో తెలియ దని అన్నారు. పిప్రి ఎత్తిపోతల పనులు చేపడుతుండగా ట్యాంక్ నంబర్ 20 కి గతంలో బిగించిన పైపు తెరిచి చూడగా అందులో కాల్చివేసిన ఆనవాళ్లు గల మనిషి అస్తి పంజరం లవ్యమైందని తెలిపారు. దాదాపు ఏడాదిన్నర క్రితం జరిగిన సంఘటనగా భావిస్తున్నట్లు తెలిపారు. రాయపూర్ కాండ్లి పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆ సమయంలో ఎవరైనా మిస్సింగ్ అయి ఉంటే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



## బౌద్ధ మహాసభ స్థాపన దినోత్సవం

**వాంకిడి, మే 4 (ప్రభాత సమాచారం):** భారతీయ బౌద్ధ మహా సభ 71వ స్థాపన దినోత్సవాన్ని సోమవారం వాంకిడి మండలంలో జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 1955 మే 4న అంబెడ్కర్ భారతీయ బౌద్ధ మహా సభ అనే సామాజిక సేవ సంస్థను ప్రారంభించారు. భారత దేశశీలో అంటరాని తనాన్ని ఎదురు కొంటున్న పంచములకు గౌరవ ప్రదమైన, జీవితాన్ని ఇవ్వడానికి అంబెడ్కర్ ఆ రోజే మొదటి అడుగు వేశారని అన్నారు.



# బాధితులకు న్యాయం చేసిన తర్వాతే విస్తరణ పనులు చేపట్టాలి

- ■ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్ ■ చెన్నూరులో చట్ట వ్యతిరేక కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలి.
- ■ నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు, దుకాణాలను కూల్చడం అమానుషం
- ■ నష్టపోయిన బాధితులను పరామర్శించిన తోల రాజిరెడ్డి, పొన్నం మల్లేషం గౌడ్
- ■ తక్షణమే నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయం చూపాలని విజ్ఞప్తి



**చెన్నూర్, మే 4 (ప్రభాత సమాచారం):** చెన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల కూల్చివేతలు నిరంకుశంగా ఉన్నాయని, చట్ట వ్యతిరేకమైన ఈ చర్యలను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తోల రాజిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర సభ్యులు పొన్నం మల్లేషం గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు విస్తరణ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులను కలిసి, వారికి జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి కనీసం ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా, బుల్డోజర్లతో ఇళ్లు, దుకాణాలను కూల్చివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించి, వారి పునరావాసానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపిన తర్వాతే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణతో చిరువ్యాపారస్తులు, సామాన్య ప్రజలు వీధిన పడ్డారని, ప్రభుత్వం వారి గోడును పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే నష్టపోయిన వ్యాపారస్తులకు ఆర్థిక సాయం అందించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర



**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కార్మికుల హకులను కాలరాసే విధంగా అవలంబిస్తున్న విధానాలు సరికావని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఏడబ్ల్యూయూ వ్య వసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన మద్ద తు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని ఉపాధి హామీ కార్మికులకు సం ఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ మేరకు మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికుల హకులను సాధించే దిశగా చేపడుతున్న పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ఈనెల 15న తలపెట్టిన బంద్‌కు పూర్తి సహకారం అందిస్తామని పేరొన్నారు. ఈ ధర్నాలో నాయకులు లంక రాఘవులు, దర్శనాల మల్లేశ్, అన్నమొల్ల కిరణ్, దత్తు, మెట్టు ప్రహ్లాద్, కొండ గణేశ్, దమ్మపాల్ పాల్గొన్నారు.



## బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం ప్రారంభం

**మంచిర్యాల, మే 4 (ప్రభాత సమాచారం):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ మంచిర్యాల క్లబ్‌లో ఆదివారం స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ వేసవి శిబిరాన్ని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు ఉపయోగించుకుని క్రీడా పోటీలలో పాల్గొని, శిక్షణను తీసుకొని క్రీడలలో నైపుణ్యాలను పొందాలని, ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వేసవి సెలవులలో ఉచితంగా బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్, కాగజ్ నగర్ ఏడిఈ గోపాల్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అడ్వైజర్ కృష్ణ, వివి బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ వివేక వర్ధన్, జయదేవ్, సురేష్ సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న రైతన్నకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ■ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి
- ■ కనుగుట్ట బాధితులను పరామర్శించిన చైర్మన్
- ■ విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం..
- ■ బాధ్యులపై చర్యలకు సిఫార్సు.
- ■ పంట బీమాపై లోతైన అధ్యయనం..
- ■ ఇతర రాష్ట్రాల విధానాల పరిశీలన.
- ■ కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దు..
- ■ ప్రతి గింజా కొంటాం ■ రైతులు అధైర్యపడొద్దు



**బోథ్, మే 4 (ప్రభాత సమాచారం):** నష్టాల్లో ఉన్న అన్నదాతకు భరోసా కల్పించి, అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన మొక్కజొన్న చేలను ఆయన స్వయంగా పరిశీలించారు. కాలిబూడిదైన పంటను చూసి చలించిన ఆయన, బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. "బిడ్డలా సాదుకున్న పంట చేతికొచ్చే తరుణంలో ఇలా అగ్నికి ఆహుతి కావడం అత్యంత బాధాకరం. గత ప్రభుత్వం కేవలం రైతు భరోసా నిధులతో సరిపెట్టుకుంది తప్ప, రైతు కష్టాన్ని పట్టించుకోలేదు. కానీ మా ప్రభుత్వం రైతును అన్ని విధాలా ఆదుకుంటుంది" అని అన్నారు. గ్రామానికి చెందిన రైతు బొడ్డు అశోక్ పంట బీమా అవశ్యకతను చైర్మన్ దృష్టికి తీసుకురాగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో సమగ్ర పంట బీమా అమలు చేసే దిశగా ఇతర రాష్ట్రాల్లోని విధానాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా అర్థమవుతోందని, బాధ్యులైన ఏఈ, లైన్‌మెన్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు కావడంతో కొనుగోళ్లలో స్వల్ప జాప్యం జరిగిందని, దీన్ని ఆసరాగా చేసుకుని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను రైతులు నమ్మవద్దని కోరారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందించడం వంటి కార్యక్రమాల ద్వారా భవిష్యత్తులో మరింత చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై నిఘా

**ఆసిఫాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ పశువధ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జిల్లాలోని సున్నిత ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 11 చెక్పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇవి 24 గంటలు పనిచేస్తూ పశువుల అక్రమ రవాణాపై కఠిన నిఘా ఉంచనున్నాయని చెప్పారు. పశువుల రవాణా, కొనుగోలు, విక్రయాలు, వధకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పశువుల రవాణాకు ముందు వెటర్నరీ వైద్యుల నుంచి సర్టిఫికేట్ తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు నెంబర్ 8712670557కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు స్వయంగా వాహనాలను అడ్డుకోవడం, తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలకు దిగకూడదని, సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి;- జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీక రించి, వాటి పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 14 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు.ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియో గించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.






# ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- హీరాపూర్‌లో ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓలతో కలిసి 'ప్రజావాణి'లో పాల్గొన్న కలెక్టర్
- రెవెన్యూ భూ సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడి
- హీరాపూర్ రోడ్డు పనులకు రూ. 12 కోట్లు..
- పైలట్ ప్రాజెక్ట్ కింద 'సోలార్ గ్రామం'గా మార్పు
- ముత్నూర్, ఇంద్రవెల్లిలో 100 పడకల ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, మే 4 (ప్రభాత సమాచారం)**

గ్రామస్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటిని నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటిడిఏ పిఓ మంద మకరందులతో కలిసి ఆయన 'ప్రజావాణి' గ్రామ సభ, 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని కలెక్టర్, పిఓ, ఎమ్మెల్యే కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను 10 నుంచి 15 రోజుల్లోగా పరిష్కరిసామని, ఏడు ఆవాస ప్రాంతాలకు రూ. 25 లక్షలతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అటవీ హక్కు పత్రాలు, రెవెన్యూ పట్టాల సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వ్యవసాయ వారోత్సవాల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే తీసుకోవాలని, నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా, డివిజన్, మండల స్థాయిల్లోనూ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి దరఖాస్తును 30 రోజుల్లోగా పరిష్కరించి, బాధితులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, నియోజకవర్గ రహదారుల కోసం రూ. 36 కోట్లు కేటాయించగా, అందులో హీరాపూర్ రోడ్డు పనులకే రూ. 12 కోట్లు వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. ముత్నూర్, ఇంద్రవెల్లి ప్రాంతాల్లో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, హీరాపూర్‌ను పైలట్ ప్రాజెక్ట్ కింద పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మార్చేందుకు సీఎం సుముఖంగా ఉన్నారని వెల్లడించారు. గిరిజన విద్యార్థుల పర్యవేక్షణకు వాట్సాప్ మానిటరింగ్ వ్యవస్థను తెచ్చామన్నారు. ఐటిడిఏ పీఓ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను 'గ్రీవెన్స్' రూపంలో నమోదు చేసుకొని రసీదు తీసుకోవాలని సూచించారు. 21 విభాగాలను సమన్వయం చేస్తూ సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు రైతులకు పలువురికి భూసార పరీక్షవిశ్లేషణ ధృవీకరణ పత్రాలను అందజేసి, విద్యుత్ జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, పిఓ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, డీడీ అంబాజీ, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం సందీప్, సర్పంచి లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణపై పకడ్బందీగా నిఘా



- పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు
- 24 గంటల పాటు షిఫ్ట్ విధానంలో వాహనాల క్షుణ్ణంగా తనిఖీ
- నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్..
- పశువులను గోశాలలకు తరలించాలని ఆదేశం
- ఐదు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఎస్ఐ స్థాయి అధికారుల పర్యవేక్షణ

**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):**

రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏడు కీలక ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో చెక్‌పోస్ట్ విధులకు హాజరయ్యే సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని పిప్పర్‌వాడ (జైనథ్), ఆనంద్‌పూర్ (జైనథ్), శంకర్‌గూడ (బేల), లక్ష్మీపూర్ (తలమడుగు), లోకారి (గాదిగూడ), ఉట్నూర్ ఎక్స్ రోడ్, మరియు ఘన్‌పూర్ (బోథ్) ప్రాంతాల్లో చెక్‌పోస్టులు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. వీటిలో ఐదు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయని, వీటి పర్యవేక్షణ బాధ్యతను ఎస్ఐ స్థాయి అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. చెక్‌పోస్టుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పశువుల రవాణాకు సంబంధించిన సరైన పత్రాలు లేని పక్షంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టుబడితే వాటిని వెంటనే సమీపంలోని గోశాలలకు తరలించాలని సూచించారు. ఎవరైనా తనిఖీలకు సహకరించకుండా వాహనాలతో పారిపోవడానికి ప్రయత్నిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా, చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. 24 గంటల పాటు షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, నాగరాజు, ప్రేమ్ కుమార్, శ్రావణ్, రమేష్ మరియు రిజర్వ్ ఎస్ఐలు పాల్గొన్నారు.



## తెలంగాణలోనూ

# పశ్చిమ బెంగాల్ ఫలితాలు

## విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, మే 4 (ప్రభాత సమాచారం):**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని దీనికి తాజాగా ఐదు రాష్ట్రాల్లో వెలువడిన ఫలితాల్లో బీజేపీ 3 రాష్ట్రల్లో గెలుపే నిదర్శమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పశ్చిమ బెంగాల్లో బీజేపీ గెలుపొందడంతో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీకి.. ప్రధాన మంత్రికి అనుకూలంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయఢంకా మోగించిందన్నారు. పశ్చిమ బెంగాల్లో లో అత్యధిక స్థానాలు రావడం అక్కడి ప్రజలు మమత బెనర్జీని ఎంతగా వ్యతిరేకించారో అర్థం అవుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రజల తీర్పే రాబోయే రోజుల్లో తెలంగాణలో రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. పశ్చిమ బెంగాల్లో గెలుపును అందించిన అక్కడి ప్రజలకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, నాయకులు లాలా మున్నా, జోగు రవి, దినేష్ మాటోలియా, ఘటిక క్రాంతి, సుమన్ బాయి, మయూర్ చంద్ర, కృష్ణ యాదవ్, శ్రీకాంత్, ఉదయ్, సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# శుభకార్యానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



**నిర్మల్, మే 4 (ప్రభాత సమాచారం):**

నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల తిరుపతిరెడ్డి కు మారుడు అల్లోల అగ్రజ్ రెడ్డి నిశ్చితార్థ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. హైదరాబాదులో జరిగిన శుభకార్యానికి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు.